

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జేఈఏ సభ్యులు

హైదరాబాద్ సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ (జేఈఏ) సభ్యులు సీఎం రేవంత్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఈఏ అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ హరి శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ శ్రీనారాయణ, మేనేజర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతీశర్మ, కళా జనార్దనమూర్తి, తదితరులు

లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణ

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంధులకు ఒక లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికి ప్రేరణ ఇస్తుందని సీబీఐ న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ అన్నారు. త్యాగరాయ గాన సభ ఆధ్వర్యంలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం లూయిస్ బ్రెయిలీ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగమారుతీ శర్మ మాట్లాడుతూ అంధులు చదువుకు దూరం అవుతున్నారన్న వేదనతో బ్రెయిలీ వారి కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి ఆశాజ్యోతిగా వారి జీవితాలను వెలుగుమయం చేశారని అన్నారు. పరులకోసం పాటుపడే నిత్య స్మరణీయులు అని అన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాశ్రీనివాస్‌కు కేటీఆర్, హరీష్ నివాళి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ప్రముఖ సంఘ సేవకుడు రామాశ్రీనివాస్‌కు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, మాజీ మంత్రి టి.హరీష్‌రావు నివాళులర్పించారు. మంగళవారం వారు శ్రీనివాస్ నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా, మోక్షారామా ఫౌండేషన్ పేరుతో రామాశ్రీనివాస్ పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ ఒడి పేరుతో అనాథలు, వృద్ధులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని కేటీఆర్, హరీశ్‌రావు గుర్తు చేసుకున్నారు.



ఉచిత వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులు

గర్భిణుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎర్రగడ్డ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ నీలిమ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన గర్భిణుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో గర్భిణులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా నీలిమ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమ శ్రీనివాస్ మాట్లాడుతూ నొప్పులు లేని ప్రసవం చేయడానికి 24 గంటలు తమ డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. గర్భిణులకు చేయూతనందించడానికి ప్రతినెలా 9న నీలిమ 9 పేరుతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రసవానికి ముందు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, శరీరంలో బిడ్డ ఎదుగుదలకు ఎటువంటి ఆహారం తీసుకోవాలి అనే విషయాలను వైద్యులు వారికి వివరించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, అశోక్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

(5వ పేజీ తరువాయి)

ఫెస్టివల్ ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు తమ ఇంట్లోనే తయారుచేసిన 400 రకాల స్వీట్లతో పాటు తెలంగాణ వంటకాలను ఈ సందర్భంగా ఏర్పాటు చేసే ఫుడ్ కోర్టులో విక్రయిస్తారని చెప్పారు. వీక్షకులను ఆకట్టుకునేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పూర్వ వైభవం తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో శైలజారామయ్యర్‌తో పాటు పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, క్లిక్ సంస్థ ప్రతినిధులు బెంజిమిన్, అభిజిత్, ఇంటర్నేషనల్ కైట్ ఫ్లైయర్ పవన్ సోలంకీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు

ఎర్రగడ్డ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని శ్రీ విజయలక్ష్మీ దేవాలయంలో 30వ ధనుర్మాసం మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నెల రోజులపాటు జరుగనున్న ఈ ఉత్సవాలలో శ్రీమాన్ అమరవాది లక్ష్మణ చార్య స్వామి ప్రతిరోజూ సాయంత్రం తిరుప్పావై ప్రవచనాలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ముఖ్యంగా తిరుప్పావై సేవా కాలం, ధనుర్మాస ప్రతిదీక్షలు, ఉత్తర ద్వార దర్శనం, శ్రీ భగవద్గీత పారాయణం, లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణం, మహాలక్ష్మి హోమం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు సంక్రాంతి పండుగతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దీపోత్సవం, అండాల్ వేషధారణ పోటీలు, అమ్మవారి పల్లకి సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడి, ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎన్‌వీ రెడ్డి, మేనేజర్ మల్లేష్, ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కర్లింగ్ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు



నేషనల్ కర్లింగ్ పోటీలో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో జరిగిన 3వ నేషనల్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్ర క్రీడాకారులు బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.సురేష్, ప్రధాన కార్యదర్శి వి.వసంత మాధురి తెలిపారు. 18 రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని వారు తెలిపారు. మిక్స్‌డ్, డబుల్స్‌లో రాష్ట్రానికి చెందిన బి.ఎం.పవన్‌కుమార్, నాగఅక్షయ బంగారు పతకాలు సాధించారని, మిక్స్‌డ్ టీమ్‌లో ఎం.నర్సింహరెడ్డి, జి.కృష్ణమూర్తి, ఎ.రాకేష్, ఎం.లక్ష్మిచైతన్య కాంస్య పతకాలు సాధించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను డాక్టర్ రష్మీసలూజా సత్కరించారు. కార్యక్రమంలో మహ్మద్ అర్షద్, మహ్మద్ డ్యానిష్ తదితరులు పాల్గొన్నారు.

అంటురోగాలతో జాగ్రత్త..

విజృంభిస్తున్న చలి.. పడిపోతున్న ఉష్ణోగ్రతలు

బంజారాహిల్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలితో నగరవాసులు వణికిపోతున్నారు. పగటిపూట కూడా ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. తుఫాన్ ప్రభావం కూడా తోడు కావడంతో చలి మరింత విజృంభిస్తోంది. చలితో పాటు అంటురోగాల విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఓ వైపు చలి మరో వైపు సన్నటి చినుకుల కారణంగా అంటురోగాలు దరిచేరే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్‌ను తట్టుకునేందుకు శరీరంలో వ్యాధి నిరోధక శక్తి సరిపోదు కాబట్టి ముందస్తుగా అంటురోగాలకు దూరంగా ఉండటం మేలని వైద్యులు సూచిస్తున్నారు.

ముక్కులోంచి శరీరంలోకి..

కాలుష్యం ఎప్పుడూ ఉంటుంది. అయితే, చలికాలం, వర్షాకాలం వచ్చినప్పుడు మాత్రం ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. గాలిలో తేమ శాతం పెరగడంతో సూక్ష్మమైన క్రిములు ముక్కులోకి చేరుతుంటాయి. ఒకొక్కటిగా అయితే తుమ్ము ద్వారా బయటకు వచ్చేస్తాయి. కానీ, తేమ శాతం పెరగడం వల్ల క్రిములు ఒకదానికొకటి అతుక్కొని పెద్ద మోతాదులో ముక్కులోకి చేరుతాయి. దీంతో అలర్జీ ఏర్పడుతుంది. ఈ అలర్జీని నిర్లక్ష్యం చేయడం వల్ల శరీరంలోకి వెళ్లి అనారోగ్యానికి కారణమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. సూక్ష్మ క్రిములు నోటి, గొంతు, చర్మం ద్వారా కూడా శరీరంలోకి చేరుతాయి. తద్వారా జలుబు, దగ్గు, జ్వరం వంటి రోగాలు దరిచేరుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు..

- చల్లటి వాతావరణంలో తిరగకుండా ఉండటమే మేలు
- భారీగా జన సమూహం ఉండే ప్రాంతాలకు వెళ్లవద్దు. ఉదాహరణకు షాపింగ్‌మాల్స్, వివాహ వేడుకలు, తదితర ప్రాంతాలు. ఇలాంటి ప్రదేశాలకు వెళ్లడంతో వైరస్ త్వరగా వ్యాప్తి చెందుతుంది
- తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే ఇంటికి తిరిగి రాగానే గోరు వెచ్చటి నీటితో నోరు పుకిలించాలి. వేడి నీటిని ఆవిరి పట్టుకోవాలి. తద్వారా వైరస్ కలిగించే పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి
- జలుబు, దగ్గు, జ్వరం బారిన పడి ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి
- రోగాల బారిన పడిన వారు వైరస్ ఇతరులకు వ్యాపించకుండా ఉండేందుకు మాస్క్ పెట్టుకోవాలి.
- అనారోగ్య సమస్య రాగానే యాంటి బయాటిక్స్ వాడుతుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. ప్రస్తుత వాతావరణ మార్పు వల్ల వచ్చే సమస్యలు 48 గంటల నుంచి ఐదు రోజుల లోపు తగ్గిపోతాయి.
- సమస్య అధికంగా ఉంటే ఎప్పటికప్పుడు వైద్యుల సలహా తీసుకోవాలి.



చలి నుంచి ఉపశమనానికి మంటకాగుతున్న దృశ్యం

జాగ్రత్తగా ఉండాలి.. లేదంటే ముప్పే

పడిపోతున్న ఉష్ణోగ్రతలతో పాటు గాలిలో తేమ పెరగడం వల్ల అంటురోగాలు త్వరగా వ్యాప్తి చెందుతాయి. వీలైనంత వరకు వీటి నుంచి రక్షణ పొందడం మేలు. లేదంటే అవి ఫ్లూగా మారే ప్రమాదం ఉంది. ఆరోగ్య సమస్య రాగానే వైద్యుడిని సంప్రదించాలి. వీలైనంత వరకు వైరస్ ఇతరులకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడాలి. శరీరంలో సహజ సిద్ధంగా దొరికే పదార్థాలతో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు ప్రయత్నించాలి. బయటి ఆహార పదార్థాల జోలికి వెళ్లకపోవడం మేలు.



-డాక్టర్ మేఘనాథ్, ఈఎన్‌టీ వైద్యులు, మా ఆస్పత్రి

బంగారు పాదుకలకు గవర్నర్ ప్రత్యేక పూజలు



బంగారు పాదుకలకు పూజ చేస్తున్న గవర్నర్ డా. తమిళిసై

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరానికి భక్తుడు కానుకగా ఇస్తున్న బంగారు పాదుకలకు గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి అయోధ్య రామమందిరానికి కానుకగా ఇచ్చేందుకు బంగారు పాదుకలు తయారు చేయించారు. ఆ పాదుకలకు గవర్నర్ తమిళిసై రాజ్‌భవన్‌లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామమందిరం గర్భగుడిలో ఉంచే బంగారు పాదుకల్ని ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని గవర్నర్ అన్నారు. శ్రీరాముడికి అంకితభావంతో శ్రీనివాస శాస్త్రి చేసిన సేవల్ని ఆమె కొనియాడారు. శ్రీరాముడి పాదుకలకు జరిపిన పూజా కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులతోపాటు రాజ్‌భవన్ పరివార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

బేగంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రమ శిక్షణతో విద్యనభ్యసించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. మంగళవారం రాజ్‌భవన్‌లో అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది నిరుపేదల పిల్లలకు గవర్నర్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నగరంలోని హమాలీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, రోజువారి పనులు చేసే వారి పిల్లలు చదువుకునే విధంగా వారికి అండగా ఉండేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న యాడ్ ఏజెన్సీలు



మాట్లాడుతున్న న్యాయవాది రాపోలు భాస్కర్

పంజాగుట్ట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మహానగరంలో ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండికొడుతున్న కార్పొరేట్ యాడ్ సంస్థల అక్రమాలను అరికట్టాలని, వారికి సహకరిస్తున్న మున్సిపల్ పరిపాలన, జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని నగరానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాడ్ ఏజెన్సీ నిర్వహకురాలు శోభారెడ్డి, గణేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జీవో 68 ప్రకారం జంట నగరాల్లో 15 ఫీట్లకన్నా ఎక్కువ ఉన్న హోర్డింగ్లు, బోర్డులకు అనుమతి లేదన్నారు. కానీ, ఎల్ అండ్ టీ మెట్రో పిల్లర్లకు, బ్రిడ్జిలకు, జంక్షన్స్‌లో, స్టేషన్లలో గోడలకు నిబంధనలకు వ్యతిరేకంగా అడ్వర్టైజ్మెంట్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో బడా యాడ్ సంస్థల అవినీతి అక్రమాలు వారికి వత్తాసు పలుకుతున్న జీహెచ్ఎంసీ, మున్సిపల్ పరిపాలన విభాగం అధికారులపై సమగ్ర విచారణ జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై అవినీతి నిరోధక శాఖ డీజీపీకి సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. కొంతమంది మున్సిపల్ అధికారులు బినామీ యాడ్ ఏజెన్సీలు ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని, వృథా చేశారని ఆరోపించారు.

బీసీలకు ఏం చేశారో ప్రధాని సమాధానం చెప్పాలి

జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన పదేళ్లలో బీసీలకు ఏం చేశారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని వారు ఆరోపించారు. జాతీయ స్థాయిలో బీసీ కులగణన చేపట్టే పార్టీకే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని, క్రీమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా విధించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపడతామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని వారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతానికి పెంచాలన్నారు. ఈనెల 13న ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసి బీసీల న్యాయమైన డిమాండ్లపై చర్చించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్‌గౌడ్, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, పలు సంఘాల నేతలు శ్రీదేవి, సుదర్శన్, నాగేష్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్‌ను సమర్పించిన కాంగ్రెస్ నేతలు



అజ్మీర్ దర్గాకు చాదర్‌ను సమర్పిస్తున్న దీపాదాస్ మున్షీ, అజారుద్దీన్

బంజారాహిల్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ క్రికెటర్, టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్ అజ్మీర్ దర్గాకు చాదర్‌ను సమర్పించారు. మంగళవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం అజ్మీర్ దర్గాకు తాను చాదర్‌ను సమర్పించటం ఆనవాయితీగా వస్తుందని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావటంతో తాను మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. అదే విధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ లీడర్ మహ్మద్ అసదుద్దీన్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ ఫహీమ్ పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించండి

ఎర్రగడ్డ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ కాలనీలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వాటిని పరిష్కరించాలని కోరుతూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్‌ను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగళ్ళ నరసింహారావు ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగళ్ళ నరసింహారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి కాలనీ అభివృద్ధి కోసం ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని ఆయన వాపోయారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి కూడా వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు స్థానికులు పీఆర్ చౌదరి, రాజశేఖర్ ఉన్నారు.

ప్రతి ఏడాది రెండు లక్షల కొత్త కేన్సర్ కేసులు : డాక్టర్ పి.రఘురామ్



మాట్లాడుతున్న డాక్టర్ రఘురామ్, చిత్రంలో అక్కినేని అమల తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది దాదాపు రెండు లక్షల కేన్సర్ కొత్త కేసులు దేశంలో నిర్ధారణ అవుతున్నాయని ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ పి.రఘురామ్ ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పాటు హెచ్ఐసీసీలో జరిగిన ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా రొమ్ము కేన్సర్ అడ్వొకసి స్క్రీనింగ్‌పై పబ్లిక్ అవేర్‌నెస్ ప్యానెల్ చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అవగాహన, ఆధారిత స్క్రీనింగ్ లేకపోవడం వల్ల కేసులు పెరుగుతున్నాయన్నారు. కేన్సర్‌ను ప్రారంభదశలో గుర్తిస్తే కోలుకునే అవకాశం ఉందన్నారు. మహిళలు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ పోషకురాలు అమల అక్కినేని మాట్లాడుతూ.. అనేక ప్రత్యేకమైన, వినూత్న కార్యక్రమాల ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం అవసరమన్నారు. మహిళలకు తప్పనిసరిగా స్క్రీనింగ్ మామోగ్రామ్ చేయించుకోవాలని తెలియదన్నారు.



సమావేశంలో ఫ్రంట్ నాయకులు

యూనియన్ స్టేట్స్ ఆఫ్ సోషలిస్ట్ అలియాన్స్ థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు

పంజాగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నూతన రాజకీయ ఆర్థిక విధానాలతో యూనియన్ స్టేట్స్ ఆఫ్ సోషలిస్ట్ అలియాన్స్ థర్డ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఫ్రంట్ అధ్యక్షుడు దేవరపల్లి మహేష్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు పలు పార్టీలు, సంఘాల నాయకులు మాట్లాడారు. ఆర్థిక అసమానతలు, ఆత్మహత్యలు లేని వ్యవస్థ, సాంఘీక అణిచివేతలు, హత్యలు జరగని, మెరుగైన సమ సమాజ సమగ్ర అభివృద్ధి కోసం థర్డ్ ఫ్రంట్ కృషి చేస్తుందన్నారు. ఈ థర్డ్ ఫ్రంట్ నిర్మాణంలో చేరాలనుకునే పార్టీలు ఈ నెల 25లోగా చేరితే ప్రజలకు ఎన్నికల ముందే ఒక స్పష్టత వస్తుందని అన్నారు. రిపబ్లిక్ డే రోజు అన్ని రాష్ట్రాల ప్రజల అభివృద్ధిని కోరుకునేలా థర్డ్ ఫ్రంట్ ప్రణాళిక విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్(ఐపీసీ) జాతీయ అధ్యక్షుడు కేటీ శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పోకల కిరణ్, ఐఎన్‌టీయూసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీజేసీపీడీఏ కార్యవర్గం ఎన్నిక



డా. లక్ష్మయ్య



పర్వతాలుగౌడ్

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జూనియర్ కాలేజెస్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీజేసీపీడీఏ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఎల్‌బీ స్టేడియంలోని ఒలంపిక్ భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బి.లక్ష్మయ్య (హైదరాబాద్), ప్రధాన కార్యదర్శిగా ఎం.పర్వతాలుగౌడ్ (హైదరాబాద్) ఎన్నికయ్యారు. కోశాధికారిగా జి.అన్నామేరి (హైదరాబాద్), ఉపాధ్యక్షుడిగా పి.పాపిరెడ్డి (మహబూబ్‌నగర్), వి.సురేష్‌కుమార్ (హైదరాబాద్), బి.బాబురావు (ఆదిలాబాద్), లాలునాయక్ (రంగారెడ్డి) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎం.ఈశ్వర్ (హైదరాబాద్), డాక్టర్ కె.సతీష్‌కుమార్ (వరంగల్), జి.జగన్‌మోహన్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), ఎం.సమ్మయ్య (మెదక్), ఎం.గంగాధర్ (నిజామాబాద్), జి.మధుజాన్సన్ (కరీంనగర్), మహిళా కార్యదర్శిగా డాక్టర్ కె.ఉమారావు (హైదరాబాద్), కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ వాదిరాజ్ (రంగారెడ్డి) ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎస్.సోమేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జె.వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, స్నేహరెడ్డి, పి.జక్కయ్య, డాక్టర్ గోపి తదితరులు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ కిషోర్ కుమార్ తెలిపారు. 11కేవీ శ్రీరామ్ నగర్, సూర్యోదయ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 11కేవీ రాజీవ్ నగర్, సెలబ్రిటీ క్లబ్, వరుణ్ టవర్స్, మినిస్టర్ రోడ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలో..

బంజారాహిల్స్ ఏడిఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. 11కేవీ స్టార్ ఆస్పత్రి, సవేరా ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ నాంధారి, కృష్ణా నగర్ సీ-బ్లాక్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, 11కేవీ తాతా రావు, టీఎస్ఎస్పీ కమాండెంట్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తు ఇచ్చి వస్తూ వృద్ధురాలి మృతి

బంజారాహిల్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సొంతూరులో ప్రజాపాలన దరఖాస్తు ఇచ్చి వస్తూ అనారోగ్యంతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. జూబ్లీహిల్స్ పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్‌లో నివాసం ఉండే బోయిని అలివేలమ్మ ఈ నెల 5న తన సొంతూరు వనపర్తి జిల్లా తాడిపత్రి గ్రామానికి వెళ్లింది. అక్కడ 6వ తేదీన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు అందజేసింది. అనంతరం తన బంధువైన వెంకటమ్మతో కలిసి నగరానికి వచ్చి ఆరాంఘర్ వద్ద బస్సుదిగి కూతురు ఇంటికి వెళ్తానని చెప్పింది. కానీ, కూతురి ఇంటికి వెళ్లలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, 8వ తేదీ ఉదయం గొల్ల గణేష్ అనే వ్యక్తి అలివేలమ్మ కుమారుడు సాయికుమార్‌కు ఫోన్ చేసి 'మీ అమ్మ చనిపోయింది'అని తెలిపాడు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన సాయికుమార్ మృతదేహం తన తల్లిదేనని గుర్తించాడు. అనారోగ్యం కారణంగా మృతిచెంది ఉండొచ్చని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బస్తీ దవాఖానాలో చోరీ



దొంగలు పడ్డ బస్తీ దవాఖానా ఇదే

దుండిగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గల సాయి పూజా కాలనీలో ఉన్న బస్తీ దవాఖానాకు సిబ్బంది మంగళవారం విధులకు హాజరవగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సర్జికల్ ఐటమ్స్, బీపీ ఆపరేటింగ్ మిషన్‌తోపాటు పలురకాల మందులు, ప్లాస్టిక్ కుర్చీలు చోరీ అయినట్లు డాక్టర్ శివాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్థానికుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాసమస్యలను పరిష్కరిస్తాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బౌద్ధనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రజాసమస్యలను పరిష్కారిస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్‌లోని ఇందిరానగర్ కాలనీ, మేడిబావి తదితర ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలు, మహిళల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుని నిధులతో అన్నిప్రాంతాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమస్యలుంటే తనకు ఫిర్యాదు చేయాలని కోరారు. స్థానికులు తీసుకువచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి ప్రధానమంత్రి నరేంద్రమోదీని గెలిపించాలని కోరారు. అనంతరం అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని అక్షింతలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, మాజీమేయర్ బండకార్తీకారెడ్డి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, మద్దెర్ల శ్యాంసుందర్, శారదామల్లేష్, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న రామకృష్ణ

కేంద్ర నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి

కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ

సికింద్రాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి జరుగుతుందని, అందుకే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మరిన్ని నిధులు తీసుకువస్తానని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. మూడో వార్డు అన్నానగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద కాలనీలో మంగళవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి ఒక్కపైసా కూడా కేటాయించలేదని విమర్శించారు. కంటోన్మెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలంటే బీజేపీని గెలిపించాలన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించారని అన్నారు. 3వ వార్డు మాజీ సభ్యురాలు బి.అనితప్రభాకర్, బీజేపీ నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, అరుణ్, ప్రవీణ్, హరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మంగళవారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో పారిశ్యుద్ధ కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ చేశారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



దినేష్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం బహదూర్‌పుర, ముస్లింగూడ, కిషాన్‌బాగ్ ప్రాంతానికి చెందిన ప్రేమ్ కుమార్ కుమారుడు దినేష్ (26) మంగళవారం బొల్లారం బజారు- బొల్లారం రైల్వే స్టేషన్ మార్గమధ్యలో రైలు పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా దూసుకువచ్చిన రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



దొంగలు పడ్డ బస్తీ దవాఖాన ఇదే

బస్తీ దవాఖానాలో చోరీ

దుండిగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గల సాయిపూజా కాలనీలో ఉన్న బస్తీ దవాఖానాకు సిబ్బంది మంగళవారం విధులకు హాజరవగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సర్జికల్ ఐటమ్స్, బీపీ ఆపరేటింగ్ మిషన్‌తోపాటు పలురకాల మందులు, ప్లాస్టిక్ కుర్చీలు చోరీ అయినట్లు డాక్టర్ శివాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

(5వ పేజీ తరువాయి)

ఫెస్టివల్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు తమ ఇంట్లోనే తయారుచేసిన 400 రకాల స్వీట్లతో పాటు తెలంగాణ వంటకాలను ఈ సందర్భంగా ఏర్పాటు చేసే ఫుడ్ కోర్టులో విక్రయిస్తారని చెప్పారు. వీక్షకులను ఆకట్టుకునేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పూర్వ వైభవం తీసుకవస్తామని చెప్పారు. కార్యక్రమంలో శైలజారామయ్యర్‌తో పాటు పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, క్లిక్ సంస్థ ప్రతినిధులు బెంజిమిన్, అభిజిత్, ఇంటర్నేషనల్ కైట్ ఫ్లైయర్ పవన్ సోలంకీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఫౌండేషన్ సహకారం..

బడి బాటలో బస్తీ పిల్లలు

అడ్డగుట్ట/మారేడుపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లటం మానేసి ఇంటికి పరిమితమైన డ్రాపవుట్ పిల్లలకు ఎంపీ ఫౌండేషన్ చదువుపట్ల వారికి అవగాహన కల్పించి, ప్రభుత్వ బడిని తీర్చిదిద్ది, వారిని తిరిగి బడిలో చేరేలా కృషి చేసింది.

మారేడుపల్లి డివిజన్ అంబేద్కర్‌నగర్ బస్తీలో రెండు అంతస్తుల్లో ఉన్న ప్రభుత్వ బడిలో ఒక టీచర్, ఇద్దరు పిల్లలు మాత్రమే చదువుకుంటున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న ఈ ప్రభుత్వ బడి శిథిలావస్థకు చేరుకుంది. వారం రోజుల క్రితం ఎం.వీ ఫౌండేషన్ ప్రతినిధులు అంబేద్కర్‌నగర్ బస్తీలో సర్వే చేసిన సమయంలో ఈ బడి దుస్థితి చూసి ఆవేదన వ్యక్తం చేశారు. బాత్‌రూంలు లేవు, తాగేందుకు నీళ్లలేవు చదువుకునేందుకు వీలుగా సౌకర్యాలు లేవు, ఒక టీచర్, చదువుకుందామంటే బడి శిథిలావస్థకు



డిప్యూటి ఐఓఎస్ అధికారి నాయక్ కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు

చేరడంతో తమ పిలలను బడికి పంపలేకపోతున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. సికింద్రాబాద్ నడిబొడ్డున సర్కారు బడి ఇంత దారుణంగా ఉండటంతో ఎంవీ ఫౌండేషన్ వారు అంబేద్కర్‌నగర్ బస్తీలలో ఉన్న బడిని బాగుచేయించేందుకు ముందుకు వచ్చారు.



బడి పిల్లలకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి భాగ్య

బడిని బాగు చేయాలనుకున్నాం.. చేశాం ..



చాలా కాలంగా శిథిలావస్థలో ఉన్న అంబేద్కర్‌నగర్ బస్తీలో ప్రభుత్వ బడిని చూస్తే బాధేసింది. ఏం చేయాలో తోచక ఎం.వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. ప్రతి ఒక్కరూ బాధ్యతతో బస్తీకి చెందిన పలువురు వివిధ పార్టీల నాయకులు రాజకీయాలకతీతంగా ఈ బడిని బాగుచేసేందుకు ముందుకు వచ్చారు. పిల్లలు చదువుకునేందుకు స్టేషనరీ వస్తువులు, బట్టలు ఉచితంగా సంస్థ నుంచి పంపిణీ చేశాము.ముఖ్యంగా ఒకే టీచర్ సరిపోకపోవడంతో ఎంవీ ఫౌండేషన్ సంస్థ నుంచి సొంత డబ్బులతో కొత్త టీచర్‌ను అపాయింట్ చేశాం. ప్రస్తుతం ఈ బడిలో ఇద్దరు టీచర్లు చదువు చెబుతున్నారు. మా సాయం మేము చేశాం. ప్రతి పిల్లాడు బడికి పోవాలి, చదువుకోవాలి, ఐఏఎస్, ఐపీఎస్‌ల స్థాయికి ఎదగాలన్నదే మా సంస్థ ముఖ్య ఉద్దేశం.

- భాగ్య, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి



బడిని శుభ్రం చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బడిని శుభ్రం చేసిన ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు

అంబేద్కర్‌నగర్ బస్తీలో ఉన్న ప్రభుత్వ బడి శిథిలావస్థకు చేరిందని ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, సువర్ణ, భాగ్య, ప్రవీణ్‌కుమార్, క్రాంతి, రమ, ప్రవీణ్‌లు వెంటనే మారేడుపల్లి డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, మారేడుపల్లి మండల డిప్యూటీ ఐఓఎస్ ప్రభుత్వ అధికారి వెంకటేష్ నాయక్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ కొంతం దీపిక వెంటనే బడిని శుభ్రం చేయించేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బందిని పంపించారు. రెండు రోజుల్లో ప్రభుత్వ బడి రూపురేఖలు మారాయి. కొత్త బడిలా తయారైన బడికి పిల్లలు వచ్చేందుకు ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. రెండు రోజుల్లో ఈ బస్తీతోపాటు పక్క బస్తీలకు చెందిన 26మంది డ్రాప్‌ఔట్ పిల్లల్ని బడిలోకి తీసుకొచ్చేందుకు రికార్డులు తయారు చేశారు. రెండు రోజుల నుంచి బడి చక్కగా నడుస్తుంది.



అంబేద్కర్‌నగర్ బస్తీలో పాడైపోయిన మరుగుదొడ్లు

ముగిసిన శంకరాచార్య ఆరాధనోత్సవాలు

పద్మారావునగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్యస్వామి దేవాలయంలో కంచి కామకోటి 68వ పీఠాధిపతి, శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్య స్వామివారి ఆరాధనోత్సవాలు ఆలయ మేనేజింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సోమవారం ఉదయం నుంచే అశేష భక్త జనసందోహం నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహంచారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవదాయ శాఖలకు చెందిన వేద పండితుల సారథ్యంలో



ఆరాధన సభావేదిపై శంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి, జస్టిస్.ఎస్.రాజేశ్వర్‌రావు, దేవదత్త గోవింద పాటిల్ తదితరులు

భగవద్గీత, రామాయణ, ఉపనిషత్తులు, శ్లోకాల పారాయణం, సదాశివ బ్రహ్మేంద్ర కృతులు, పంచరత్న కృతులు, గురు కృతుల సామూహిక పారాయణం వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.



రథోత్సవంలో పండితులు, భక్తులు

ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికతను సంతరించుకొ న్నాయి

స్కందగిరి ఆలయంలో జరిగే ప్రతి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు నేను తప్పక హాజరవుతాను. స్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తితో కూడుకున్న ప్రశాంతమైన వాతావరణంతో పారవశ్యమవుతాను. ఆరాధనోత్సవాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మికతను సంతరించుకొన్నాయి. అలాంటి గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్నిచ్చింది.

వేముల భాను ప్రకాశ్, సీతాఫల్‌మండి.

కనులపండువగా మహా రథోత్సవం

శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా ఆలయంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నాను. ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తాను. సాయంత్రం నిర్వహించిన మహారథోత్సవం కన్నుల పండుగలా సాగింది. వందల సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

ఓ.పావని, స్పై, స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షురాలు

బంగారు పాదుకలకు గవర్నర్ ప్రత్యేక పూజలు



బంగారు పాదుకలకు పూజలు చేస్తున్న గవర్నర్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరానికి భక్తుడు కానుకగా ఇస్తున్న బంగారు పాదుకలకు గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి అయోధ్య రామమందిరానికి కానుకగా ఇచ్చేందుకు బంగారు పాదుకలు తయారు చేయించారు. ఆ పాదుకలకు గవర్నర్ తమిళిసై రాజ్‌భవన్‌లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య రామమందిరం గర్భగుడిలో ఉంచే బంగారు పాదుకల్ని ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని గవర్నర్ అన్నారు. శ్రీరాముడికి అంకితభావంతో శ్రీనివాస శాస్త్రి చేసిన సేవల్ని ఆమె కొనియాడారు. శ్రీరాముడి పాదుకలకు జరిపిన పూజా కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులతోపాటు రాజ్‌భవన్ పరివార్ పాల్గొన్నారు.

బేగంపేట : క్రమ శిక్షణతో విద్యనభ్యసించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నా రు. మంగళవారం రాజ్‌భవన్‌లో అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది నిరుపేదల పిల్లలకు గవర్నర్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నగరంలోని హమాలీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, రోజువారి పనులు చేసే వారి పిల్లలు చదువుకునే విధంగా వారికి అండగా ఉండేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో జరిగిన రంగోలీ పోటీలు

ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో రంగోలీ పోటీలు

అడ్డగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు వైద్యం అందిస్తునే మరో వైపు సాంప్రదాయ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రభుత్వ ఎస్‌పిహెచ్ఓ డాక్టర్ జయశ్రీ అన్నారు. మంగళవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో రంగోలి పోటీలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లు సిబ్బంది ప్రజల కోసం నిరంతరంగా పనిచేస్తున్నప్పటికి పండుగల సమయంలో సంప్రదాయా పద్ధతిలో వేడుకలు జరుపుకోవడం ఆనందగా ఉందన్నారు. ఒక వైపు ప్రజలకు వైద్యం అందిస్తునే మరో వైపు పండుగలకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందిలో ఉత్సాహం చూపుతుందన్నారు. ఈ రంగోలి పోటీలో విజేతులగా మొదటి విజేత ఎస్. లావణ్య, రెండవ విజేత బి. చామంతి, మూడవ విజేత అనుషా, రన్నర్ విజేతగా కవిత లు విజేతలుగా గెలుపొందారు. రంగోలి పోటీలో అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సాయిశంకర్, పిహెచ్ఎన్ ఉమలతో పాటు ఆశా వర్కర్లు, సిబ్బంది సీనియర్ నర్సులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు

బీసీలకు ఏం చేశారో ప్రధాని సమాధానం చెప్పాలి

జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన పదేళ్లలో బీసీలకు ఏం చేశారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని వారు ఆరోపించారు. జాతీయ స్థాయిలో బీసీ కులగణన చేపట్టే పార్టీకే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతిస్తామని స్పష్టంచేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని, క్రీమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా విధించాలని డిమాండ్ చేశారు.

తాము అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపడతామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని వారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతానికి పెంచాలన్నారు. ఈనెల 13న ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసి బీసీల న్యాయమైన డిమాండ్లపై చర్చించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్‌గౌడ్, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, పలు సంఘాల నేతలు శ్రీదేవి, సుదర్శన్, నాగేష్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కర్లింగ్ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు



రాష్ట్ర క్రీడాకారులు

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో జరిగిన 3వ నేషనల్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్ర క్రీడాకారులు బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.సురేష్, ప్రధాన కార్యదర్శి వి.వసంత మాధురి తెలిపారు. 18 రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని వారు తెలిపారు. మిక్స్‌డ్, డబుల్స్‌లో రాష్ట్రానికి చెందిన బి.ఎం. పవన్‌కుమార్, నాగఅక్షయ బంగారు పతకాలు సాధించారని, మిక్స్‌డ్ టీమ్‌లో ఎం.నర్సింహారెడ్డి, జి.కృష్ణమూర్తి, ఎ.రాకేష్, ఎం.లక్ష్మిచైతన్య కాంస్య పతకాలు సాధించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను డాక్టర్ రష్మీసలూజా సత్కరించారు. కార్యక్రమంలో మహ్మద్ అర్షద్, మహ్మద్ డ్యానిష్ తదితరులు పాల్గొన్నారు.

యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో వెయ్యి రోబోటిక్ సర్జరీలు

హైదరాబాద్‌సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): యూరాలజీ, యూరో - అంకాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో వెయ్యి రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తిచేసి అరుదైన రికార్డును సాధించినట్లు ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ(ఏఐఎన్‌యూ) ఆస్పత్రి ప్రకటించింది. కిడ్నీ కేన్సర్, ప్రోస్టేట్ కేన్సర్, బ్లాడర్ కేన్సర్, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ (మూత్రనాళ పునర్నిర్మాణం, మరమ్మతుల లాంటి చికిత్స) లలో ఈ రోబోటిక్ సర్జరీలు చేసినట్లు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున తెలిపారు. ఆపరేషన్ తర్వాత రోగి వెంటనే కోలుకునేలా సంప్రదాయ శస్త్రచికిత్స, రోబోటిక్ శస్త్రచికిత్సల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. యూరాలాజికల్ కేన్సర్లు, ముఖ్యంగా ప్రోస్టేట్ కేన్సర్ కేసులు బాగా ఎక్కువవుతున్నాయని డాక్టర్ మల్లికార్జున వివరించారు. కొత్త ఇమేజింగ్ పద్ధతులతో ఈ కేన్సర్లను ప్రాథమిక దశల్లోనే గుర్తించగలమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ వీసీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కమిషనర్‌కు వినతి

బౌద్ధనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదేశాలమేరకు సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. మంగళవారం సీతాఫల్‌మండిలో బస్తీబాటలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి స్థానికులు వర్షపునీటి పైపులైన్ నిర్మాణపనులు, నాలా పూడికతీత పనులు, నూతన రహదారులు, కమ్యూనిటీహాలు నిర్మాణంతో పాటు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. వెంటనే కేంద్రమంత్రి జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో ఫోన్ మాట్లాడి బీజేపీ బృందంను మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించి రావాలని ఆదేశాలు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, ఇందిరానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నగరపు శ్యామ్, పంపర యాదగిరి తదితరులు మున్సిపల్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కలిసి వినతిపత్రంను అందజేశారు.



లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతీశర్మ, కళా జనార్దనమూర్తి, తదితరులు

లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణ

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంధులకు ఒక లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణ ఇస్తుందని సీబీఐ న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం లూయిస్ బ్రెయిలీ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగమారుతీ శర్మ మాట్లాడుతూ అంధులు చదువుకు దూరం అవుతున్నారన్న వేదనతో బ్రెయిలీ వారి కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి ఆశాజ్యోతిగా వారి జీవితాలను వెలుగుమయం చేశారని అన్నారు. పరులకోసం పాటుపడే నిత్య స్మరణీయులు అని అన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికరంగాలకు సర్వేలతో సత్ఫలితాలు

ఫ్యాప్సీలో రౌండ్ టేబుల్ సమావేశం

మంగళ్‌హాట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దేశంలోని పరిశ్రమ అభివృద్ధి, వాటి గణాంకాలపై ఆధారపడి ఉంటుందని, వార్షిక సర్వే ఆధారంగా అనేక మార్పులు, సంస్కరణలు తీసుకొచ్చేందుకు వీలు కల్పించినట్టవుతుందని తెలంగాణ రాష్ట్ర నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్(ఎన్ఎస్ఎస్ఓ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, తెలంగాణ రాష్ట్ర రీజనల్ హెడ్, స్టాటిస్టిక్స్ అధికారి డి.సతీష్ అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవన్‌లో పలు అసోసియేషన్ల నేతలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.సతీష్ మాట్లాడుతూ పరిశ్రమ వార్షిక సర్వే దేశంలోని పారిశ్రామిక గణాంకాలకు ప్రధాన ములాధారమని అన్నారు. కలెక్షన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ చట్టం - 2008 నిబంధన ప్రకారం ప్రతి ఏటా సర్వే నిర్వహించబడుతుందని చెప్పుకొచ్చారు. సర్వేలు, స్టాటిస్టిక్స్‌తో తీసుకొచ్చే మార్పుపై అవగాహన కల్పించేందుకే ఈ సమావేశం నిర్వహించామన్నారు. సర్వే ద్వారా స్వీకరించిన సమాచారం గణాంక ప్రయోజనాల కోసం ఉపయోగకపడడమే కాకుండా పారిశ్రామిక రంగాన్ని అంచనా వేయడం, వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు రూపొందించడంతో ప్రభుత్వానికి తోడ్పాటు కల్పిస్తుందని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.సతీష్

అనంతరం అసోసియేషన్ల ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతి రెడ్డి, అధికారులు కె గురు స్వామి, రమేష్ మెండుతో పాటు సీనియర్ స్టాటిస్టికల్ అధికారులు పాల్గొన్నారు.